RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 156 | మే 15, 2025 | వెల : రూ.3-00



థాయిలాండ్‌కు పరారైన బంగ్లా మాజీ ప్రెసిడెంట్

3లో..









# నక్సలిజాన్ని నిర్మూలిస్తాం..

## ఇదే మా ప్రతిజ్ఞ : సీఆర్ పీఎఫ్ డీజీ, చత్తీస్ ఘడ్ డీజీపీ

**వేద న్యూస్, డెస్క్:**

ఆపరేషన్ కగార్ పేరుతో చేపట్టిన ఆపరేషన్లో భద్రతా దళాలు 31మంది నక్సలైట్లను హతమార్చినట్లు ఛత్తీస్గఢ్ పోలీసులు, సీఆర్పీఎఫ్ అధికారులు తెలిపారు. బుధవారం బీజాపూర్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్ కు సంబంధించిన విషయాలను సీఆర్పీఎఫ్ డీజీ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్, ఛత్తీస్గఢ్ డీజీపీ అరుణ్ దేవ్గౌతమ్ వెల్లడించారు. కర్రెగుట్ట కొండలు చుట్టూ ఏప్రిల్ 21న ఆపరేషన్ కగార్ పేరుతో దీనిని ప్రారంభించామన్నారు. దాదాపు 21 రోజులు పాటు జరిగిన భారీ ఆపరేషన్లో దాదాపు 20,000మంది సిబ్బంది చత్తీస్గఢ్ పోలీసులు, సీఆపీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. మే 11న ఆపరేషన్ ను విరమించుకున్నామని ఈ భారీ ఆపరేషన్లో మొత్తం 21 ఎన్కౌంటర్లు జరిగాయన్నారు. 16మంది మహిళ కేడర్స్‌తో సహా 31మంది మావోయిస్టులు మరణించారని వెల్లడించారు. వారి నుంచి ఎస్ఎల్ఆర్, ఐఎన్ఎస్ఏఎస్ ఇతర ఆటోమేటిక్, సెమీ ఆటోమేటిక్ సహా 35 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని అని తెలిపారు. 214 బంగర్లు గుర్తించి ధ్వంసం చేశామన్నారు. 450 ఐఈడీలు, 818 బారెల్ గ్రెనేడ్ లాంచర్ల షెల్స్, 899 కార్డెక్స్ డిటోనేటర్లు, భారీ మొత్తం పేలుడు పదార్థలను అంతేకాకుండా దాదాపు 12,000 కిలోల ఆహార పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. దేశంలోని 6 జిల్లాలు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయని అందులో ఛత్తీస్గఢ్‌లో నాలుగు, మహారాష్ట్ర, ఝూర్ఖండ్లో ఒక్కొక్కటి ఉన్నాయి. ఛత్తీస్గఢ్‌లో సుక్మా, బీజాపూర్, నారాయణపూర్, కాంకేర్ జిల్లాలు నక్సల్స్ ప్రభావిత జిల్లాలు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజం పూర్తిగా అంతమవుతుందని స్పష్టం చేశా



రు. నక్సలిజాన్ని ఎలాగైనా నిర్మూలించాలి. ఇదే మా ప్రతిజ్ఞ అని తెలిపారు. ఇక ఈ ప్రాంతంలో తమ కదలికను తిరిగి ప్రారంభించడానికి ప్రయత్నిస్తున్నామని. పూర్వం, ప్రజలు ఆలయంలో పూజలు చేయడానికి ఇక్కడికి వచ్చేవారు. ఇక్కడ నక్సలైట్ శిబిరాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి ఈ కార్యకలాపాలు ఆగిపోయాయి. మేం దాన్ని మళ్లీ ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నామని అని వారు తెలిపారు.




# ‘బంధన్’తో బంధమేందీ..?

- అమ్యామ్యాలా..? అలవాటా..?
- ప్రాణాలతో పన్లేదా.. పైసలే ప్రామాణికమా..
- మాముళ్ల మత్తులో వరంగల్ వైద్యారోగ్యం..?
- ఫిర్యాదులొస్తున్నా యంత్రాంగం పట్టింపేదీ..

**వేద న్యూస్, వరంగల్ జిల్లా:**

‘పిల్లికి చెలగాటం.. ఎలుకకు ప్రాణ సంకటం’గా మారింది వరంగల్ ప్రజల పరిస్థితి. పేరుకు పెద్దాస్పత్రి అని వెళితే.. పైసలే పరమావధిగా భావిస్తూ ప్రాణాలను గాల్లో కలిపేస్తున్నారు. జ్వరమనో.. కడుపు నొప్పి అంటూ వెళ్లినా.. స్కానింగ్.. ఎక్స్‌రేలంటూ రూ.లక్షలు గుంజేస్తున్నారు. పేరుకు మల్టీ స్పెషాలిటీ అంటూ బోర్డు పెట్టేసి... ఒక్క వైద్యుడే సర్వాంతర్యామిలా అన్ని రోగాలకు ట్రీట్‌మెంట్ ఇచ్చేస్తున్నాడు. వచ్చీరాని ట్రీట్‌మెంట్ చేయడంతో వైద్యం వికటించి పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇదేంటని అడిగితే.. బెదిరింపులు.. భౌతికదాడులు పరిపాటిగా మారింది. ఇంతకీ ఆ హాస్పిటల్ మరేదో కాదు.. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హన్మకొండలోని బంధన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్. గత కొంతకాలంగా బంధన్ హాస్పిటల్ రోగుల పాలిట మృత్యుకుహారంగా మారుతున్నా.. పాలకులు, అధికారులకు ఏ మాత్రం పట్టడం లేదు. వరంగల్ మహానగరంలో కండ్ల ముందే బంధన్ హాస్పిటల్‌లో పిట్టల్లా ప్రాణాలు కోల్పోతున్నా.. జిల్లా యంత్రాంగం మాత్రం చర్యలకు పూనుకోవడం లేదు. రాజకీయ ఒత్తిళ్లా..? లేక అమ్యామ్యాలు కారణమో కానీ బంధన్‌తో అధికార యంత్రాంగానికి ఉన్న బంధమేంటో తెలియడం లేదు.

### గతంలో ‘బంధన్’ ఆస్పత్రిపై ఫిర్యాదు..చర్యలు నిల్

గతంలో బంధన్ ఆస్పత్రిలో జరిగిన నిర్లక్ష్యంతో ప్రాణాపాయ స్థితికి వెళ్లి

మిగతా 4వ పేజీలో..



## రేసోనేన్స్ పబ్లిక్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి..!

**వేద న్యూస్, హన్మకొండ :**

రేసోనేన్స్ పబ్లిక్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ హన్మకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో డీఈఓ వాసంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషా బోయిన సంతోష్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లా కేంద్రంలో హసన్ పర్తి ఎర్రగట్టు గుట్ట వద్ద ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి సిద్ధమైన రేసోనేన్స్ పబ్లిక్ స్కూల్‌కి ఆన్లైన్లో ఫైల్ అప్లై చేసుకోకుండానే విద్యాశాఖ ఓపెనింగ్ పర్మిషన్ ఇల్లీగల్ గా ఇవ్వడం జరిగిందన్నారు. కానీ రికగ్నేషన్ లేకుండా..రాకుండా పాఠశాల నడపడానికి వీలు లేదు దాంతో పాటు బిల్డింగ్ ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం లేదని ఆరోపించారు. భవిష్యత్తులో పర్మిషన్ వచ్చే అవకాశం కూడా లేదు కాబట్టి ఈ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారకముందే చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలకు గదులు ఇరుకుగా ఉండడం, వెంటిలేషన్ లేకపోవడం గ్రౌండ్ లేకపోవడం, జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి ఒక ప్రైవేట్ కళాశాల పేరును వారి అనుమతి లేకుండానే పెట్టుకుని దాని అనుబంధ పాఠశాల రెస్సోనేన్స్ పబ్లిక్ స్కూల్ అని (సీబీఎస్సీ) అని విద్యాశాఖ అధికారులను ప్రజలను, విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తూ ప్రభుత్వ అనుమతి లేకుండానే అడ్మిషన్లు చేసుకుంటూ వ్యాపారమే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. దాంతోపాటు జిల్లా

మిగతా 4వ పేజీలో..

# ‘మట్టి’ మాఫియా దందా

- పగలు, రాత్రి తేడా లేదు..
- జోరుగా మట్టి అక్రమ రవాణా..
- జేసీబీ, రెండు ట్రాక్టర్‌లు పట్టుకొని వదిలేసిన ఆఫీసర్లపై విమర్శలు

**వేద న్యూస్, ఇల్లందకుంట:**



ఇల్లందకుంట మండల పరిధిలోని తనుగుల, గంగ్రపల్లి గ్రామాల్లో మట్టి మాఫియా.. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నది. ఎలాంటి అనుమతి లేకుండా వారం క్రితం తనుగుల చాకలికుంటలో జేసీబీతో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తుండగా.. ఇరిగేషన్ అధికారులు జేసీబీ, రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు.. తరలిస్తుండగా పట్టుకున్న వాహనాలను వదిలివేయడంపై అధికారులపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మట్టి తీయాలంటే ప్రభుత్వానికి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి పర్మిషన్ తీసుకోకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ప్రభుత్వానికి రుసుం చెల్లించినా కేవలం పని దినాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే మట్టి తరలించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు పట్టించుకోకుండా మట్టి మాఫియా అర్ధరాత్రి, సెలవు దినాల్లో అక్రమంగా మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

### ఆఫీసర్లు పట్టించుకోవట్లే..

గతంలో మట్టి అక్రమ రవాణా పై సంబంధిత అధికారులకు



ఫిర్యాదు చేస్తే అక్రమార్కులకు సమాచారం చేరవేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అక్రమ రవాణా పై అసలు ఏ శాఖకు అడ్డుకట్ట వేసే అధికారం ఉందనే సందేహం కలుగుతోంది. ఎన్నో సార్లు మట్టి అక్రమ రవాణాపై రెవెన్యూ శాఖకు, ఇరిగేషన్ శాఖకు పోలీస్ శాఖకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఏ శాఖ కూడా సక్రమంగా స్పందించకపోవడం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి మాఫియా పై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.



## సీజేఐగా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ బీఆర్ గవాయ్

**వేద న్యూస్, డెస్క్:**

సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు తదితరులు హాజరయ్యారు. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన రెండో దళిత వ్యక్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ రికార్డులకెక్కారు. జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ 1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించారు. 1985లో లా ప్రాక్టీస్ ప్రారంభించిన తర్వాత, భోసలే వంటి సీనియర్ న్యాయవాదులతో కలిసి పనిచేశారు. అనతికాలంలోనే స్వతంత్రంగా ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారు. ఆయన మునిసిపల్ కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, కార్పొరేషన్లకు స్టాండింగ్ కౌన్సిల్‌గా ఉన్నారు. నాగ్ పూర్ బెంచ్లో కెరీర్ ప్రారంభించిన ఆయన తన పట్టుదలతో సీజేఐ దాకా ఎదిగారు.



# చరిత్రకు నిదర్శనం ‘ఓరుగల్లు’

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

**వేద న్యూస్, వరంగల్ :**

తెలంగాణ రాజధాని హైద్రాబాద్ లో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరీమణుల పోటీలలో పాల్గొంటున్న వివిధ దేశాలకు చెందిన 22 మంది సుందరీమణుల బృందం బుధవారం వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ సందర్శించింది. ప్రపంచ సుందరీమణులకు వరంగల్ జిల్లా యంత్రాంగం ఘనంగా ఆతిథ్యమిచ్చింది. జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య నేతృత్వంలో హరిత కాకతీయలో వారికి జిల్లాల యంత్రాంగం ఘనంగా స్వాగతం పలికింది. వెయ్యి స్తంభాల దేవాలయం సందర్శన అనంతరం సుందరీమణుల బృందం ఖిలా వరంగల్ కు చేరుకొని, కోటలో ఏర్పాటు చేసిన ప్లియా మార్కెట్ను సందర్శించి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన

మిగతా 4వ పేజీలో..

# రుతుపవనాలు వచ్చేశాయ్!

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నైరుతి రుతు పవనాలు మంగళవారం దేశంలో ప్రవేశించాయి. దక్షిణ బంగాళాఖాతం, దక్షిణ, ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతాలు, నికోబార్ దీవుల్లోని కొన్ని ప్రాంతాలను నైరుతి రుతుపవనాలు తాకాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) ప్రకటించింది. రాబోయే మూడు నాలుగు రోజులలో రుతుపవనాలు మరింతగా విస్తరిస్తాయని పేర్కొంది. దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు – కొమోరిన్ ప్రాంతాలు, దక్షిణ బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, అండమాన్ నికోబార్ దీవులు, అండమాన్ సముద్రంలోని మిగిలిన ప్రాంతాలు, మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే 3,4 రోజులలో రుతుపవనాల విస్తరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వివరించింది. రుతుపవనాల రాకతో ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదవు తుందని అంచనా వేసింది. దిగువ వాతావరణ స్థాయిలలో పశ్చిమ గాలులు బలంగా బలంగా ఉండడం, దక్షిణ ద్వీపకల్పంలో 40 రోజుల పాటు ఉరుములతో కూడిన వర్షపాతం నమోదు కావడం, వాయవ్య పసిఫిక్ మహా సముద్రంలో సాధారణం కంటే ముందుగానే తాకబోతున్నట్లు సంకేతాలు ఇస్తున్నాయని ఐఎండి తెలిపింది.

# కేంద్రానికి ఆర్‌బిఐ భారీ డివిడెండ్?




**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఖజానాను ఖాళీ చేసే పనిలో మోడీ సర్కార్ పడినట్లు తెలుస్తోంది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2024–25కుగాను కేంద్రానికి ఏకంగా రూ.2.25 లక్షల కోట్ల నుంచి రూ.2.75 లక్షల కోట్లు డివిడెండ్ చెల్లించేందుకు ఆర్‌బిఐ సిద్ధం అవుతోందని టైమ్స్ ఓ కథనంలో వెల్లడించింది. ఈ భారీ డివిడెండ్‌ను ప్రస్తుత నెలలోనే ప్రకటించనుందని ఆర్థికవేత్తలు, విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గతేడాది రూ.2.10 లక్షల కోట్ల డివిడెండ్ అందించింది. ఈసారి దానిని మరింత పెంచనుందనే అంచనాలు వెలుపడుతున్నాయి. ఈ మొత్తం చెల్లిస్తే ఆర్థిక సంవత్సరం 2025–26 కోసం వార్షిక బడ్జెట్‌లో అంచనా వేసిన రూ. 2.2 లక్షల కోట్లు మించిపోతుంది. రూపాయి మారక విలువను కాపాడేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల రికార్డు స్థాయిలో డాలర్ అమ్మకాలు చేపట్టింది. 2024 సెప్టెంబర్ ముగింపు నాటికి భారత్ వద్ద రికార్డ్ స్థాయిలో 704 బిలియన్ డాలర్ల విదేశీ మారకం నిల్వలున్నాయి. కాగా.. 2024 ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి 2025 మధ్య రికార్డ్ స్థాయిలో 371.6 బిలియన్ డాలర్లను విక్రయించిందని అంచనా. పెద్ద ఎత్తున నగదు లభ్యత కార్యకలాపాలు చేపట్టింది. ఈ నిధులు కేంద్ర ప్రభుత్వానికి ఆర్థిక లోటును తగ్గిస్థాయని, ప్రభుత్వ వ్యయం, బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీని సైతం పెంచుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

# భారతీయుల దెబ్బకు టర్కీ అజర్‌బైజాన్ విలవిల!

**వేద న్యూస్, డెస్క్:**

“చెరపకురా చెడేవు..” అంటారు మన పెద్దలు. ఇప్పుడు ఇదే సామెతను టర్కీస్‌లో గుర్తు చేసుకుంటోంది ఆ దేశం. భారతదేశంపై దాడికి పాకిస్తాన్‌కు ఆయుధాలు అందించిన టర్కీని.. కోలుకోలేని దెబ్బతిస్తున్నారు భారతీయులు. బాయ్‌కాట్ టర్కీ అంటూ టూరిజంతోపాటు వస్తువులను కూడా బహిష్కరిస్తున్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న టర్కీకి భారతీయుల బాయ్‌కాట్ నిర్ణయం పిడుగులా మారింది. “చెరపకురా చెడేవు..” అంటారు మన పెద్దలు. ఇప్పుడు ఇదే సామెతను టర్కీస్‌లో గుర్తు చేసుకుంటోంది ఆ దేశం. భారతదేశంపై దాడికి పాకిస్తాన్‌కు ఆయుధాలు అందించిన టర్కీని.. కోలుకోలేని దెబ్బతిస్తున్నారు భారతీయులు. బాయ్‌కాట్ టర్కీ అంటూ టూరిజంతోపాటు వస్తువులను కూడా బహిష్కరిస్తున్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న టర్కీకి భారతీయుల బాయ్‌కాట్ నిర్ణయం పిడుగులా మారింది.

అపకారికి సైతం ఉపకారం చేయడం భారత్ నైజం. కానీ ఆపదలో ఆదుకున్న ఉపకారికి కూడా అపకారం తలపెట్టి తన బుద్ధిని చాటుకుంది టర్కీ. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా ఆపరేషన్ సింధూర్‌ను చేపట్టింది భారత్. దీంతో పాక్‌కు అనుకూలంగా వ్యవహరించిన టర్కీ.. మనదేశంపై దాడి చేసేందుకు క్షిపణులు, డ్రోన్లను సరఫరా చేసింది. ఆ డ్రోన్లతోనే భారత భూభాగంపై దాడి చేసింది పాకిస్తాన్. 2023లో టర్కీని భారీ భూకంపం వణికించినప్పుడు అన్ని దేశాల కంటే ముందు ఆపరేషన్ దోస్త్ పేరుతో ఆదుకుంది భారత ప్రభుత్వం. ఆ మేలును మరిచి పోయిన టర్కీ.. భారత్‌పైనే విషం చిమ్మింది. దీంతో ఎర్డోగాన్ ప్రభుత్వం తీరుపై తీవ్రంగా మండిపడుతున్నారు..భారతీయులు. టర్కీ చేసిన ద్రోహంతో రగిలిపోతున్న భారతీయులు బాయ్‌కాట్‌టర్కీ పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. దీశీఎఝ్ఘబతీనివఎ అంటూ ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులను నిరాకరిస్తున్నారు. టర్కీ పర్యాటకంతో పాటు టర్కీ ఎయిర్ లైన్స్ కోసం మనం ఖర్చు చేసే ప్రతి రూపాయి మన జాతి ప్రయోజనాలకు వ్యతిరేకంగా నిలబడే వారికి మద్దతు ఇస్తుందని.. అందుకే ఈ బాయ్ కాట్ టర్కీ ఉద్యమం అని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. టర్కీతో పాటు పాకిస్తాన్‌కు మద్దతుగా నిలిచిన అజర్‌బైజాన్‌కు కూడా భారతీయులు షాక్ ఇస్తున్నారు. ఆ రెండు దేశాలకు ట్రావెల్ బుకింగ్ సేవలు అందించే పలు ప్రముఖ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు కొత్త బుకింగ్‌లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. అంతే కాకుండా అత్యవసరం అయితే తప్ప ఆ దేశాలకు ప్రయాణాలు పెట్టుకోవద్దని సూచిస్తున్నాయి.

ప్రముఖ టూరిస్ట్ సర్వీసెస్ సంస్థ ‘కాక్స్ అండ్ కింగ్స్’.. టర్కీ, అజర్‌బైజాన్‌లకు కొత్త బుకింగ్‌లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. మరో ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెన్సీ ఈజ్ మై ట్రిప్ కూడా అత్యవసర పరిస్థితులుంటే తప్ప టర్కీ, అజర్‌బైజాన్‌లను సందర్శించవద్దని కోరింది. ట్రావోమింట్ అనే మరో ట్రావెల్ ప్లాట్‌ఫామ్ కూడా టర్కీ, అజర్‌బైజాన్‌లకు సంబంధించిన అన్ని రకాల ప్రయాణ ప్యాకేజీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే చేసుకున్న బుకింగ్‌లు రద్దు చేసుకుంటే ఎలాంటి క్యాన్సలేషన్ ఫీజులు వసూలు చేయబోమని స్పష్టం చేసింది. గోవాలో టర్కీష్ పౌరులకు ఎలాంటి వసతి సేవలను అందించకూడదని తాము నిర్ణయించుకున్నట్లు గోవా విల్లాస్ సంస్థ వెల్లడించింది. టర్కీష్ ఎయిర్ లైన్స్‌తో తన భాగస్వామ్యాన్ని ముగించినట్లు గో హోమ్ స్టేస్ సంస్థ ప్రకటించింది. పర్యాటకంపై ఆధారపడ్డ ఆ దేశాలపై ఈ నిర్ణయం భారీగా ప్రభావం చూపుతోంది. పుణేలోని వ్యాపారులు సైతం టర్కీ యాపిల్స్‌ను బహిష్కరిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. దీంతో స్థానిక మార్కెట్‌లో టర్కీ యాపిల్స్ కనిపించకుండా పోయాయి. పుణే మార్కెట్‌లో టర్కీ యాపిల్స్ సీజన్ టర్నోవర్ రూ.1200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. వ్యాపారుల తాజా నిర్ణయం పండ్ల మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపనుంది. అయినప్పటికీ వర్తకులు దీన్ని కేవలం ఆర్థిక నిర్ణయంగా కాకుండా, ప్రభుత్వానికి, సాయుధ బలగాలకు సంఘీభావంగా చూస్తున్నామని చెబుతున్నారు. ఇక ఈ మధ్యకాలంలో టర్కీ మార్బుల్, కార్పెట్స్, డిజైనర్ వేర్స్, ఫర్నిచర్, లైట్స్‌కు కూడా భారత్‌లో డిమాండ్ పెరిగింది. తాజా పరిణామాల నేపథ్యంలో వాటి వ్యాపారంపై కూడా ప్రభావం కనిపిస్తోంది.

# సాధారణ స్థితికి సరిహద్దు ప్రాంతాలు

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



సరిహద్దులో స్తంభించిన జనజీవనం ప్రశాంతతతో, సాధారణ స్థాయికి తిరిగి వచ్చింది. గత రెండు రోజులుగా జమ్మూ కాశ్మీర్, రాజస్థాన్, పంజాబ్ మరియు గుజరాత్ సరిహద్దు ప్రాంతాలలో వైమానిక దాడులు, షెల్లింగ్ లేదా కాల్పులు జరగలేదు. పూంచ్, రియాసి, శ్రీనగర్, రాజౌరి, జైసల్మేర్ మరియు బార్మేర్ వంటి ప్రాంతాలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. శ్రీనగర్‌లో పాఠశాలలు, విద్యాసంస్థలు తిరిగి తెరవబడ్డాయి. మంగళవారం రాత్రి సాంబా సెక్టార్‌లో డ్రోన్ కనిపించినట్లు వచ్చిన నివేదికలు భయాందోళనలను రేకెత్తించాయి. చిన్న పేలుడు వినిపించిందని, ఒక ఇంటికి స్వల్ప నష్టం జరిగినట్లు సమాచారం. రాజౌరిలోని నియంత్రణ రేఖ వెంబడి ఉన్న ఒక గ్రామంలో లభించిన పేలని పేలుడు పదార్థాలను సైన్యం నిర్వీర్యం చేసింది. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో విద్యాసంస్థలు తెరవలేదు. ముందు జాగ్రత్త చర్యగా సోమవారం కూడా బ్లాక్‌అవుట్ విధించారు. పఠాన్‌కోట్ మరియు ఫాజిల్కాలో విద్యాసంస్థలు తెరవలేదు. జలంధర్‌లో సైన్యం కఠినమైన నిఘా కొనసాగిస్తోంది. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో పాఠశాలలు, దుకాణాలు తిరిగి తెరవబడ్డాయి.


# రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెడుతున్నారా..?

**వేద న్యూస్, డెస్క్:**



భారతీయ సంప్రదాయంలో పండగలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి అందరూ ఎంతో ఉత్సాహంగా జరుపుకొంటారు. దసరా, దీపావళి, హోలీ.. ఇలా ఏ పండగ వచ్చినా అందరూ సొంత గ్రామానికి చేరుకుని సంబరాలు చేసుకుంటారు. అలాగే పండగల రోజు కొత్త పని చేయడం శుభప్రదంగా భావిస్తారు. ఆ రోజు బంగారు ఆభరణాలు, వాహనాలు కొనుగోలు చేయడం, రియల్ ఎస్టేట్ లో పెట్టుబడులు పెట్టడానికి ప్రాధాన్యమిస్తారు. నేడు భూమి విలువ రోజురోజుకూ పెరుగుతోంది. ప్రతి ఒక్కరూ వాటిని కొనడానికి ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో రియల్ ఎస్టేట్ రంగం ప్రగతి పథంలో దూసుకుపోతోంది. అయితే ఈ రంగంలో పెట్టుబడి పెట్టే ముందు కొన్ని అంశాలను గమనించాలని నిపుణులు సూచిస్తున్నారు. అవి ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. రియల్ ఎస్టేట్ సంస్థలు తమ భూములను కొనుగోలు చేసేవారికి అనేక ఆకర్షణీయమైన డిస్కౌంట్లు ప్రకటిస్తాయి. వాటినే కాకుండా కొన్ని ప్రాథమిక అంశాలపై కొనుగోలుదారులు అవగాహన పెంచుకోవాలి. భూమి ఉన్న ప్రదేశం, డెవలపర్ ట్రాక్ రికార్డు, ఆమోదాలు, మౌలిక సదుపాయాలు, ఇతర ప్రాంతాలతో కనెక్టివిటీ వంటి వాటిని చూసుకోవాలి. ప్రస్తుతం టైర్ 2 నగరాల్లో రియల్ ఎస్టేట్ జోరుగా సాగుతోంది. తక్కువ ఈఎంఐలు, నో కాస్ట్ డౌన్ పేమెంట్, ప్రత్యేక పండగ పథకాలను అందజేస్తున్నారు. రియల్ ఎస్టేట్ లోని పెట్టుబడులకు ఆదాయపు పన్ను చట్టం ప్రకారం కొన్ని మినహాయింపులు లభిస్తాయి. హౌసింగ్ రుణాలు, వాటి చెల్లింపులను కొనుగోలుదారులు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో పెట్టుబడి పెడితే రాబోయే ఏడాదిలో పన్ను ప్రయోజనం పొందవచ్చు. వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో జీతాలు పెరుగుతాయి. ఆ పెరిగిన మొత్తాన్ని రియల్ ఎస్టేట్ లో పెట్టుబడిగా పెడితే బాగుంటుంది. మీకు ఇష్టమైన పండగ రోజు ఈ నిర్ణయం తీసుకుంటే.. మీకు దీర్ఘకాలంలో ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఈ ఆర్థిక క్రమశిక్షణతో మీరు కొంత కాలానికి సొంతింటి వారవుతారు. రియల్ ఎస్టేట్ లో పెట్టుబడులు, ఇళ్ల కొనుగోలు తదితర విషయాలపై వెంటనే నిర్ణయం తీసుకోకూడదు. ముందుగా మార్కెట్ పరిస్థితులు, భూమి విలువ తదితర వాటిపై అవగాహన పెంచుకోవాలి. చాలా రియల్ ఎస్టేట్ కంపెనీలు తమ కస్టమర్లకు బంగారు నాణేలు తదితర వివిధ బహుమతులు అందిస్తాయి. అయితే భూమి విలువ, అనుకూలమైన ఫైనాన్సింగ్ నిబంధనలు, పారదర్శక లావాదేవీలు తదితర వాటిని కొనుగోలుదారులు ఆలోచించాలి. తాము పెట్టిన పెట్టుబడికి దీర్ఘకాలంలో మంచి రాబడి వచ్చేలా ఉండాలి. కాబట్టి భూమి విలువ, మార్కెట్ పరిస్థితులపై అవగాహన పెంచుకుని రియల్ ఎస్టేట్ లో పెట్టుబడి పెట్టాలి.

# సింధూ జలాలపై కాళ్ల బేరానికి పాకిస్థాన్!




**వేద న్యూస్, డెస్క్:**

సింధూ నదీ జలాల ఒప్పందం విషయంలో ఇదివరకు దూకుడుగా వ్యవహరించిన పాకిస్థాన్ వైఖరిలో మార్పు వచ్చినట్లు కనిపిస్తోంది. ఒప్పందాన్ని నిలిపివేస్తే ఎదురయ్యే తీవ్ర పరిణామాలను గ్రహించిన ఆ దేశం, ఈ అంశంపై తన నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని భారత్‌ను అభ్యర్థించింది. సింధూ జలాల విషయంలో తగ్గేది లేదని భారత్ పదేపదే తేల్చి చెప్పడంతో పాకిస్థాన్ తానే వెనక్కి తగ్గింది. ఈ మేరకు భారత ప్రభుత్వానికి లేఖ రాసింది. సింధూ నదీ జలాలను భారత్ నిలిపివేస్తే తమ దేశంలో తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేస్తూ పాకిస్థాన్ జలవనరుల మంత్రిత్వ శాఖ, భారత జలశక్తి మంత్రిత్వ శాఖకు ఒక లేఖ రాసినట్లు సమాచారం. ఈ సున్నితమైన అంశంపై చర్చలు జరిపేందుకు పాకిస్థాన్ సిద్ధంగా ఉందని ఆ లేఖలో పేర్కొంది. నిబంధనల ప్రకారం, ఈ లేఖను భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపినట్లు తెలుస్తోంది. అయితే, ఈ విషయంలో భారత్ తన వైఖరిని ఇదివరకే స్పష్టం చేసింది. “రక్తం, నీరు రెండూ ఏకకాలంలో ప్రవహించలేవు” అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గతంలోనే తేల్చిచెప్పారు. పాకిస్థాన్‌తో చర్చలు జరిగితే అవి కేవలం ఉగ్రవాదం నిర్మూలన, పీవోకేకు సంబంధించిన అంశాలపైనే ఉంటాయని స్పష్టం చేశారు. సింధూ జలాల ఒప్పందం విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని భారత ప్రభుత్వం పలుమార్లు స్పష్టం చేసింది.

# శత్రు డ్రోన్లకు చెక్!: ‘భార్గవాస్త్ర’ ప్రయోగం విజయవంతం

**వేద న్యూస్, డెస్క్:**

దేశ రక్షణ రంగంలో మరో ముందడుగు పడింది. శత్రు డ్రోన్ల సమూహాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ‘భార్గవాస్త్ర’ కౌంటర్ డ్రోన్ వ్యవస్థను విజయవంతంగా పరీక్షించారు. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (ఎస్‌డీఏఎల్) ఈ అత్యాధునిక వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఇటీవలి కాలంలో పెరుగుతున్న డ్రోన్ల ముప్పును ఎదుర్కోవడంలో ఇది కీలక పాత్ర పోషించనుంది. ఒడిశాలోని గోపాల్‌పూర్ వద్ద గల సీవార్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఈ పరీక్షలు జరిగినట్లు ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ అధికారులు తెలిపారు. మొత్తం మూడు దశల్లో ట్రయల్స్ నిర్వహించగా, అన్నింటిలోనూ ‘భార్గవాస్త్ర’ తన లక్ష్యాలను కచ్చితంగా ఛేదించినట్లు వెల్లడించారు. మొదటి రెండు పరీక్షల్లో ఒక్కో మైక్రో రాకెట్‌ను ప్రయోగించగా, మూడో విడతలో రెండు రాకెట్లను కేవలం రెండు సెకన్ల వ్యవధిలో ప్రయోగించి, డ్రోన్ల సమూహాన్ని విజయవంతంగా నిర్వీర్యం చేశారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, డ్రోన్ల ద్వారా ఎదురవుతున్న భద్రతా సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఈ వ్యవస్థను రూపొందించారు. ‘భార్గవాస్త్ర’ వ్యవస్థ శత్రు డ్రోన్లను సుమారు 2.5 కిలోమీటర్ల దూరం నుంచే గుర్తించి, మైక్రో రాకెట్ల సాయంతో వాటిని కూల్చివేయగలదు. దీనిలోని శక్తివంతమైన రాడార్ వ్యవస్థ 6 నుంచి 10 కిలోమీటర్ల పరిధిలోని గగనతల ముప్పులను పసిగట్టగలదు. ఈ వ్యవస్థలో రెండు అంచెల రక్షణ ఉంటుంది. మొదటి అంచెలో అన్‌గైడెడ్ మైక్రో రాకెట్లు ఉంటాయి. ఇవి 20 మీటర్ల పరిధిలోని డ్రోన్ల గుంపును నాశనం చేస్తాయి. రెండో అంచెలో ఉండే గైడెడ్ మైక్రో క్షిపణులు నిర్దేశిత లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదిస్తాయి. తక్కువ ఖర్చుతో, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ‘భార్గవాస్త్ర’ సముద్ర మట్టానికి 5000 మీటర్ల ఎత్తులోని పర్వత ప్రాంతాలు, కొండల ప్రదేశాల్లో కూడా సమర్థవంతంగా పనిచేస్తుందని కంపెనీ వెల్లడించింది. ఆత్మనిర్భర్ కార్యక్రమంలో దీన్ని కీలక పరిణామంగా భావిస్తున్నారు.

# సంపాదకీయం

## ఫ్రీ ట్రేడ్ భారత్‌కు నష్టదాయకం

అమెరికా ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ కోరుతున్నది, మోడీ ప్రభుత్వం అందుకు సిద్ధపడింది. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి వాన్స్ ఇప్పటికే చర్చలు జరిపి వెళ్లారు. అమెరికా వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ ద్వైపాక్షిక ఒప్పందంలో వ్యవసాయాన్ని మినహాయించేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. ఫ్రీ ట్రేడ్ ఒప్పందం జరిగితే, అమెరికా వ్యవసాయ ఉత్పత్తులన్నీ సుంకాలు లేకుండా దిగుమతి చేసుకోవలసి ఉంటుంది. పాలు, పాల పొడి, సోయా బీన్స్, కాఫీ, మొక్కజొన్న, గోధుమలు, బియ్యం, పప్పులు, నూనె గింజలు, పత్తి, ఎథనాల్ దిగుమతులలో ఉంటాయి. జన్యు మార్పిడి విత్తనాలు, పండ్లు, కూరగాయలు, ప్రాసెసింగ్ చేసిన ఆహార పదార్థాలు దిగుమతులు అవుతాయి. ఎరువులు, డీజిల్‌పై ఇస్తున్న సబ్సిడీలు తగ్గించాలని కూడా అమెరికా కోరుతున్నది. అమెరికాలో బ్లూ బాక్స్, అంబర్ బాక్స్, గ్రీన్ బాక్స్‌ల పేరుతో రైతులకు వ్యవసాయ పెట్టుబడులలో 50 శాతం వరకు సబ్సిడీలు ఇస్తారు. మన ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు అన్నీ కలిపి 3 శాతం మించి లేవు. అందువల్ల మన పంటల ఉత్పత్తి ఖర్చులు ఎక్కువ. ఎరువులు, డీజిల్‌పై సబ్సిడీలు తగ్గిస్తే మన పంటల ఉత్పత్తి ఖర్చులు మరింత పెరుగుతాయి. 50 శాతం సబ్సిడీలు పొందుతున్న అమెరికా రైతులతో హీనమైన సబ్సిడీలు పొందుతూ పంటలు పండిస్తున్న మన రైతులు పోటీ పడాల్సి వస్తుంది. అది సాధ్యం అయ్యేది కాదు, ఈ పోటీలో మన పంటలు ధరలు పడిపోయి మన రైతులు దివాళా తీయడం తప్ప వేరే మార్గం ఉండదు. విదేశీ, స్వదేశీ కంపెనీలు, ఎగుమతి, దిగుమతి వ్యాపారులు కుమ్మక్కై ధరలు తెగ కోసి లాభాలు గడించడానికి ఉపయోగపడుతుంది.

మన ప్రజా పంపిణీ వ్యవస్థను ఎత్తివేయాలన్నది అమెరికా విధిస్తున్న మరొక షరతు. ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాల నిమిత్తం ప్రభుత్వం కొనుగోలు చేసి నిల్వ ఉంచుతుంది. ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కొనుగోలు ఉండడానికి, కొంతవరకు వ్యాపారులు మార్కెట్ రేట్లు తెగ్గోయడానికి వీలు లేకుండా ఉంది. ప్రభుత్వ సంస్థలు కొనుగోలు బాధ్యత నుండి తప్పుకుంటే వ్యాపారుల ఇష్టారాజ్యం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధి రద్దు చేసింది. ప్రభుత్వ సంస్థలు కొనుగోళ్ళు చేయడం లేదు. ఫలితంగా ఈ ఏడాది రైతులు పండిస్తున్న మన పంటల ధరలన్నీ పడిపోయాయి. మిర్చి, పొగాకు, ధాన్యం, మినుములు, పత్తి, జీడి పిక్కలు, కోకో గింజల ధరలు గత ఏడాదికన్నా సగానికి సగం తగ్గించుకోవడం, లేదా అసలు కొనకపోవడం చూస్తున్నాము. అగ్రిమెంట్ రాకముందే ఇలా ఉంటే అగ్రిమెంట్ వస్తే ఎలా ఉంటుందో ఊహించాలంటేనే పరిస్థితి భయానకంగా ఉంది. అమెరికా కంపెనీలపై వ్యాజ్యాలు వేసే విధానం రద్దు చేయాలన్నది అగ్రిమెంట్‌లో అమెరికా కోరుతున్న మరొక షరతు. ఇప్పటికే బహుళజాతి కంపెనీలకు లొంగిన భారత ప్రభుత్వం విత్తన చట్టాన్ని పక్కన పెట్టింది. ప్రత్తి పంటకు మాత్రమే ఉన్నది. నాసిరకం విత్తనాల వల్ల రైతులు నష్టపోతే కోర్టుకు వెళ్లే అవకాశం ఉంది. ఈ అవకాశం ఉండగానే కంపెనీలు కోర్టు తీర్పులకు సైతం లెక్కచేయకుండా రైతులను ముప్పతిప్పలు పెడుతున్నాయి. కోర్టుకు వెళ్లే అవకాశం లేకుండా చేస్తే కంపెనీల ఇష్టారాజ్యం అవుతుంది. నాసిరకం విత్తనాలు, క్రిమిసంహారకాలు రైతులను తీవ్రంగా నష్టపరుస్తాయి.

కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధాన పత్రం విడుదల చేసింది. పత్రం విడుదల చేసిన 15 రోజుల లోపల అభ్యంతరాలు ఉంటే తెలియజేయమని చెప్పింది. ఈ పత్రాన్ని పరిశీలిస్తే రెండు అంశాలు స్పష్టం అవుతున్నాయి. 2020లో అప్రజాస్వామికంగా తెచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాల స్థానంలో కార్పొరేట్ల దోపిడీకి అనుకూలమైన విధానాలను దొడ్డి దారిన అమలుకు పూనుకోవడం. విదేశీ, స్వదేశీ కార్పొరేట్ కంపెనీలు మన వ్యవసాయ మార్కెట్లలో స్వేచ్ఛగా ప్రవేశించి అయిన కాడికి మన రైతాంగాన్ని దోపిడీ చేయడం. ఇప్పుడున్న మార్కెట్ చట్టానికి 12 సవరణలు చేసింది. సవరణలు అన్నీ విదేశీ, స్వదేశీ, కార్పొరేట్ శక్తులు, ఎగుమతి దిగుమతి వ్యాపారులు మన వ్యవసాయ మార్కెట్లలో స్వేచ్ఛగా జొరబడి మన రైతులను దోపిడీ చేయడానికి వీలు కల్పించేవే. ఎగుమతి దిగుమతి దారులు, ప్రాసెసింగ్ కంపెనీలు మనకున్న సంస్థగత మార్కెట్ యార్డులు, ఎఫ్‌సిఐ, సిడబ్ల్యూసి, వేర్‌హౌసింగ్ గోడౌన్లను స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి వీలు కల్పించేవే. ఇప్పటికే 2 లక్షల టన్నులు నిల్వ సామర్థ్యం కలిగిన గోడౌన్లు అదానికి అప్పగించారు. ఈ విధానం ప్రకారం పంటలకు మద్దతు ధరల విధానం ఉండదు. రైతులు తమ పంటలను కంపెనీల, వ్యాపార వర్గాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి అమ్ముకోవాల్సి రావడం తప్ప గత్యంతరం ఉండదు. ప్రభుత్వ ఏజెన్సీలేవీ మార్కెట్లో కొనుగోలు చేయవు. ఈ విధానాలు రద్దు చేసిన చట్టాల కన్నా మరింత ప్రమాదకరమైనవి.

సరళీకరణ విధానాల పుణ్యమా అని వ్యవసాయ రంగం సంక్షోభానికి గురైంది. రైతు పండించిన పంటలకు మద్దతు ధరలు లేకుండా పోయాయి. ఫలితంగా రైతాంగం రుణగ్రస్తులయ్యారు. మద్దతు ధరల కన్నా తక్కువకు అమ్మడం, కొనడం వలన రైతాంగం ఏటా రూ.2 లక్షల కోట్లు కోల్పోతున్నారని అంచనా. దేశంలో రైతు సంఘాలు చేసిన పోరాట ఫలితంగా డా॥ స్వామినాథన్ కమిషన్ ఏర్పడింది. స్వామినాథన్ కమిషన్ వ్యవసాయ సంక్షోభం పరిష్కారానికి అనేక విలువైన సూచనలు చేసింది. ఆ సూచనలలో అత్యంత కీలకమైనది రైతు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించడం. స్వామినాథన్ సమగ్ర ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి పంటల ధరలు నిర్ణయించాలని, ఆ ధరల అమలుకు పటిష్టమైన చట్టం చేయాలని సూచించారు. దానిని సి2 ప్లస్ 50 శాతం ఫార్ములాగా పేర్కొన్నారు. దేశంలోని రైతు సంఘాలు సి2 ప్లస్ 50 శాతం ఫార్ములా అమలు కోసం, రైతు రుణ విముక్తి కోసం పోరాటం సాగించిన క్రమంలో బిజెపి ఎన్నికలలో అమలుకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చాక మోసగించింది. రైతులు కోరుతున్న చట్టాలకు మారుగా కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు మూడు నల్ల చట్టాలను తెచ్చింది.

# మా సైనికులు 11మంది మృతి చెందారు

**వేద న్యూస్, డెస్క్:**

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ జరిపిన దాడుల్లో 11 మంది సైనికులు మరణించారని పాకిస్థాన్ సైన్యం వెల్లడించింది. మరో 78 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపింది. వీరిలో సైనికులతో పాటు ఐదుగురు ఎయిర్ ఫోర్స్ సిబ్బంది ఉన్నట్లు పాకిస్థాన్ ఆర్మీ వివరించింది. గాయపడిన వారు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పింది. ఈ మేరకు పాకిస్థాన్ ఆర్మీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 40 మంది పౌరులు కూడా పలు చోట్ల జరిగిన దాడుల్లో మృతి చెందినట్లు పాక్ ప్రకటించింది. పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా సైనిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో దాదపు 100 మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారు. అలాగే ఆ ప్రాంతంలో ఉగ్రవాదులకు సంబంధించిన మౌలిక సదుపాయాలను సైతం ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలో భారత్‌లోని పాకిస్థాన్ సరిహద్దునున్న రాష్ట్రాలకు చెందిన జిల్లాలపై పాకిస్థాన్ డ్రోనులు, క్షిపణులతో దాడులకు దిగింది. ఈ



దాడులను భారత్ తిప్పికొట్టింది. దాదాపు నాలుగు రోజుల పాటు ఇరు దేశాల మధ్య ఉద్రిక్తల నడుమ శనివారం సాయంత్రం మే 10వ తేదీ ఇరు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని అంగీకరించిన సంగతి తెలిసిందే.

## థాయిలాండ్‌కు పరారైన

# బంగ్లా మాజీ ప్రెసిడెంట్

**వేద న్యూస్, డెస్క్:**





బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ గతవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కట్టుబట్టలతో థాయిలాండ్‌కు బయలుదేరి వెళ్లిపోయారు. షేక్ హసీనా సర్కార్ పతమనైన తర్వాత దేశం నుంచి అవామీలీగ్ కు చెందిన సీనియర్ నాయకుడు దేశం విడిచి పోవడం ఇదే ప్రథమం. ఒక హత్యకేసులో నిందితుడుగా ఉన్న హమీద్ దేశం విడిచి ఎలా వెళ్లారన్నది సంచలనంగా మారింది. అసలు ఆయన వెళ్లేందుకు ఎవరు అనుమతి ఇచ్చారన్న దానిపై ఉన్నతస్థాయి దర్యాప్తు మొదలైంది. మహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వం అవామీ లీగ్ పార్టీపై నిషేధం విధించడంతో మాజీ ప్రెసిడెంట్ దేశం విడిచి వెళ్లిపోయినట్లు తెలిసింది. మొహమ్మద్ అబ్దుల్ హమీద్ ఢాకా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి థాయ్ లాండ్ ఎయిర్ వేస్ విమానంలో కేవలం లుంగీ, కట్టుబట్టలతో దేశం విడిచి వెళ్లిపోయారు. బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం కళ్లుతెరిచి ఏం జరిగిందో గుర్తించిన వెంటనే పలువురు అధికారులను సస్పెండ్ చేసి ఉన్నతస్థాయి దర్యాప్తు కు ఆదేశించింది. అబ్దుల్ హమీద్ 2013 నుంచి 2023 వరకూ రెండు పర్యాయాలు బంగ్లాదేశ్ ప్రెసిడెంట్ గా ఉన్నారు. 2024లో ఆందోళన సమయంలో షేక్ హసీనా, ఆమె సహాయకులపై నమోదైన ఓ హత్యకేసులో ఆయన సహనిందితుడు. నిరసనకారులపై హసీనా సర్కార్ కాల్పులు జరిపి ఒకరిని చంపిందనే ఆరోపణలు ఉన్నాయి. హమీద్ తన సోదరుడు, తన బావమరిదితో కలిసి, వైద్యం కోసం వెళ్లారని ఆయన కుటుంబ సభ్యులు అంటున్నారు. లుంగీ కట్టుకుని వీల్ చైర్ లో ఉన్న హమీద్ విమానాశ్రయంలో ఉన్న సిసిటివి కెమెరాల వీడియోలు వైరల్ అయ్యాయి.

## మరో 540 మిలియన్

# డాలర్లను నిలిపివేసిన ట్రంప్

**వేద న్యూస్, డెస్క్:**



హార్వర్డ్ యూనివర్శిటీపై ట్రంప్ కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఆ యూనివర్శిటీకి మరో 540 మిలియన్ డాలర్ల గ్రాంట్లపై కోత విధించింది. ట్రంప్ యంత్రాంగం గతంలో నిలిపివేసిన 2.2 బిలియన్ డాలర్లకు అదనంగా ఎనిమిది ఫెడరల్ ఏజన్సీల నుండి 540 మిలియన్ డాలర్ల గ్రాంట్లను నిలిపివేస్తున్నట్లు మంగళవారం ఫెడరల్ యాంటి సెమినిజం టాస్క్‌ఫోర్స్ ( యూదు వ్యతిరేక బృందం) హార్వర్డ్‌కు రాసిన లేఖలో పేర్కొంది. హార్వర్డ్ దాతృత్వం మరియు వివక్షకు నిలయంగా మారిందని, అత్యుత్తమ విద్యాసంస్థగా దాని వారసత్వాన్ని తిరిగి పొందేందుకు సుదీర్ఘ పోరాటం చేయాల్సి వుందని లేఖలో పేర్కొంది. హార్వర్డ్ క్యాంపస్‌లో చీకటి సమస్య ఉందని, జవాబుదారీతనం, బుజ్జగింపులకు ప్రాధాన్యత ఇస్తూ యాజమాన్యం గ్రాంట్లను వదులుకుందని తెలిపింది. ఈ లేఖపై విద్యాశాఖ, ఆరోగ్యం మరియు మానవ సేవలు మరియు సాధారణ సేవలు యంత్రాంగం అధికారులు సంతకం చేశారు. హార్వర్డ్ ఉదారవాదం, యూదు వ్యతిరేకతకు నిలయంగా ఉందనే ఆరోపణలను ఐవి లీగ్ పాఠశాల తిప్పికొట్టిన మరుసటి రోజు ఈ పరిణామం చోటుచేసుకుంది.ఈ కోతలతో పాటు ఇటీవల ట్రంప్ యంత్రాంగం విధించిన అనేక ఆంక్షలపై హార్వర్డ్ చట్టపరంగా సవాలు చేసింది. పాలస్తీనా అనుకూల కార్యకలాపాలను పరిమితం చేయాలని, వైవిధ్యం మరియు సమానత్వం, సమగ్ర అభ్యాసాలను అంతం చేయాలనే ట్రంప్ ప్రభుత్వం డిమాండ్లను బహిరంగంగా ధిక్కరించిన, పెరుగుతున్న ఆంక్షలను ఎదుర్కొన్న మొదటి అమెరికా యూనివర్శిటీగా హార్వర్డ్ నిలిచింది. ప్రభుత్వ డిమాండ్లకు తలగ్గకపోతే హార్వర్డ్‌కు కొత్త ఫెడరల్ గ్రాంట్లను నిలిపివేస్తామని గతవారం విద్యాశాఖ బెదిరింపులకు దిగిన సంగతి తెలిసిందే. ట్రంప్ ప్రభుత్వ ఆరోపణలను తోసిపుచ్చుతూ హార్వర్డ్ అధ్యక్షుడు అలాన్ గార్బర్ సోమవారం ఒక లేఖను రాశారు. హార్వర్డ్ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తోందని, చట్టానికి లోబడి ఉందని పేర్కొన్నారు. సమాఖ్య ఆంక్షలు మా యూనివర్శిటీ కార్యకలాపాల ప్రాథమిక అంశాలను నియంత్రించడానికి చట్టవిరుద్ధమైన ప్రయత్నమని ఆయన లేఖలో తెలిపారు.



# బాంబు వల్ల కాదు, ఆకలితో చనిపోతారు

**వేద న్యూస్, డెస్క్:**

గాజాకు మానవతా సహాయాన్ని కూడా ఇజ్రాయిల్ యుద్ధ ఆయుధంగా మారుస్తోందని ఐక్యరాజ్యసమితి ఏజెన్సీ తెలిపింది. గాజా ప్రజలు ఎదుర్కొంటున్న బాధలు, విషాదం మాటల్లో చెప్పలేనిది, రెండు నెలలకు పైగా ఎటువంటి సహాయం అందలేదని పాలస్తీనా శరణార్థుల సహాయ మరియు మానవాభివృద్ధికి మద్దతు ఇచ్చే ఐక్యరాజ్యసమితి సంస్థ కమిషనర్ జనరల్ ఫిలిప్ లాజారిని బిబిసికి చెప్పారు. "కరువు వ్యాపిస్తోంది, ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. రాబోయే రోజుల్లో బాంబు దాడి వల్ల కాదు, ఆహారం లేకపోవడం వల్ల ప్రజలు చనిపోతారు" అని ఆయన అన్నారు.పోషకాహార లోపం, ఆకలి గాజాలో మొత్తం తరానికి జీవితాంతం దుష్ప్రభావం కలిగిస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. డబ్ల్యూహెచ్ఓ పాలస్తీనా ప్రతినిధి రిక్ పెప్పర్‌కార్న్ మాట్లాడుతూ క్లినిక్‌లలో చాలా మంది కుంగిపోయిన పిల్లలను తాను చూశానని అన్నారు. ఇజ్రాయి తన వినాశకరమైన దిగ్బంధనను కొనసాగిస్తున్నందున గాజాకు ఆహారం, నీరు, ఇతర ముఖ్యమైన సామాగ్రిని రెండు నెలలకు పైగా నిలిపివేశారు. మిగిలిన ఇజ్రాయిల్ బందీలను విడుదల చేయమని హమాస్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఈ క్రూరత్వం ఒక ఒత్తిడి వ్యూహమని ఇజ్రాయిగీకరించింది. గాజాపై తన వినాశకరమైన దిగ్బంధనను వెంటనే ఎత్తివేయాలని మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇజ్రాయిల్‌కు పిలుపునిచ్చింది. జాతి నిర్మూలనకు ప్రజలను ఆకలితో అలమటించడం యుద్ధ నేరమని పేర్కొంది. ఖాన్ యూనిస్‌లోని నాజర్ ఆసుపత్రిపై మంగళవారం ఇజ్రాయిల్ బాంబు దాడి చేసి, జర్నలిస్ట్ హసన్ ఎస్లాతో సహా ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి నెతన్యాహు స్పందిస్తూ, రాబోయే రోజుల్లో సైన్యం పూర్తి శక్తితో దాడి చేస్తుందని అన్నారు.

## యుపిఎస్సీ ఛైర్మన్‌గా

## మాజీ రక్షణ కార్యదర్శి అజయ్ కుమార్

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్సీ) ఛైర్మన్‌గా మాజీ రక్షణ కార్యదర్శి అజయ్ కుమార్‌ను నియమిస్తూ కేంద్ర సిబ్బంది మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 29న ప్రీతి సుడాన్ పదవీకాలం ముగియడంతో యుపిఎస్సీ ఛైర్మన్ పదవి ఖాళీ కానుంది. ఈ పదవికి అజయ్ కుమార్ నియామకాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదించినట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. కేరళ కేడర్‌కు చెందిన 1985 బ్యాచ్ రిటైర్డ్ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఎఎస్) అధికారి అయిన అజయ్ కుమార్ 2019 ఆగస్టు 23 నుండి 2022 అక్టోబర్ 31 వరకు రక్షణ కార్యదర్శిగా పనిచేశారు. ఐఏఎస్, ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపిఎస్) వంటి వాటికి అధికారులను ఎంపిక చేయడానికి యుపిఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలను నిర్వహిస్తుంది. దీనికి ఒక ఛైర్మన్ నాయకత్వం వహిస్తారు. దీనిలో గరిష్టంగా 10 మంది సభ్యులు ఉండవచ్చు. ప్రస్తుతం కమిషన్‌లో ఇద్దరు సభ్యుల పదవులు ఖాళీగా ఉన్నాయి. యుపిఎస్సీ ఛైర్మన్‌ను పదవీకాలం ఆరు సంవత్సరాలు.

వేద న్యూస్

గురువారం మే 15, 2025



## క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలి

**వేద న్యూస్,దామరచర్ల :**

దామరచర్ల మండలంలోని తిమ్మాపురం గ్రామపంచాయతి కాంగ్రెస్ పార్టీ మండల యువజన నాయకుడు ధనావత్ కిషన్ నాయక్,బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రికెట్ కిట్ ఉచితంగా అందించడం జరిగింది తిమ్మాపురం కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ కోట ఈశ్వర్ మాట్లాడుతూ క్రీడాకారులు ఆటలతోపాటు చదువులకు రాణించాలని, తిమ్మాపూర్ గ్రామానికి మంచి పేరు తేవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేష్ నాయక్,దాసరి ఏడుకొండలు, శ్రీను నాయక్,వినోద్ నాయక్,శ్రీకాంత్,బాబు,బాజీ, సతీష్, సందీప్, బాబు కిరణం, దత్తు,ఆంజినేయులు,కోట అనిల్ లతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు,బి ఎల్ ఆర్ బ్రదర్ పాల్గొన్నారు.

## అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తిని అరెస్టు చేయాలి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



అసెంబ్లీ అనే వాట్సాప్ గ్రూప్‌లో శ్రీనివాస్ అనే వ్యక్తి ఆపరేషన్ సింధూర్ ను విమర్శిస్తూ అనుచిత పోస్టులు పెట్టాడని చట్టపరంగా అతని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ నేతలు పేట పోలీసులను కోరారు. ఈ మేరకు వారు మీర్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీర కర్ణ రెడ్డి, బిక్షపతి చారి, తులసిముఖేష్ కేంద్రంలో మోడీ ప్రభుత్వం దేశ రక్షణ కోసం క్షణం తీరిక లేకుండా పనిచేస్తుండగా కొందరు దేశద్రోహులు భారత ప్రతిష్టను దిగజారితే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ అవమాన పరుస్తున్నారని, భరతమాతకు తీరని అన్యాయం చేస్తున్నారని, కనుక పోలీసులు సదరు వ్యక్తిని గుర్తించే కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి, కీసర గోవర్ధన్ రెడ్డి, భీమరాజ్ హైందవి పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

రోజు రోజుకు వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని బాలాపూర్ మండలం నాదర్గుల్లోని భాగ్యనగర్ రైతు సేవ సహకార సంఘం చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి అన్నారు. రైతుల వద్దకు శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా సంఘం కార్యాలయానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు అధికారులు విచ్చేసి ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు.




## కరాటే మాస్టర్లకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

మహిళలకు పురుషులకు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని ఎంతోమంది సెలబ్రిటీలు, పౌర సమాజం చెబుతున్న నేపథ్యంలో చాలా మంది బాలబాలికల నుండి యువకుల వరకు కరాటే నేర్చుకుంటూ ఆత్మ సంరక్షణకు దోహదం చేస్తున్నారని అలాంటి కరాటే శిక్షణ ఇస్తున్న ఇన్స్ట్రక్టర్లకి ఇంటి స్థలాలు, కేటాయించాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఏ ఎస్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. సన్ ఈగల్ ఇంటర్నేషనల్ కరాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ప్రతిరోజు మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, కొనసాగుతున్న నేపథ్యంలో ఆత్మ సంరక్షణార్థం కరాటే నేర్పిస్తున్న ఇన్స్ట్రక్టర్లకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ఇన్స్ట్రక్టర్లు తమకు ఇంటితో పాటు విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు కొంత స్థలం కేటాయించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పుణ్యం కట్టుకోవాలని కోరారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లేందుకు వారికి కరాటే తో పాటు కౌన్సిలింగ్ కూడా ఇస్తున్నామని మా జీవనోపాధి కొరకు మేము కోరిన ఈ చిరు కోరికను మన్నించాలని ఇన్స్ట్రక్టర్లు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఇన్స్ట్రక్టర్లు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరాటే పోటీలలో పాల్గొని తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు మెమెంటోలు శ్రీనివాస్ అందజేశారు.

## పేదల ఇంటి కల నెరవేరేదెప్పుడో..!

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



ప్రపంచంలోనే భారతదేశం అతి పెద్ద ప్రజాస్వామిక దేశం. దేశంలో అనేక రాష్ట్రాలు ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో భారతదేశానికి స్వతంత్రం సిద్ధించి 78 సంవత్సరాల కాలం గడిచిన ఇప్పటికి పేద,బడుగు, బలహీన, వర్గాల వారికి కూడు గూడు గుడ్డ దిక్కు లేదని బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ రామిడి వీర కర్ణ రెడ్డి విమర్శించారు. బుధవారం నాడు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వాలు అధికారాల్లోకి రావాలి అంటే ఎన్నికల ముందు మాయ మాటలు గారడీ మాటలు చెప్పి ఓట్లు దండుకోవడమే తప్ప పేద ప్రజలకు కనీస అవసరాలైన గృహ నిర్మాణం సొంత ఇంటి కల నెరవేర్చకపోవడం దుర్మార్గమైన చర్యగా ప్రజలు అభివర్ణిస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు 12 సంవత్సరాల కాలంలో అయినా కూడా గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ప్రస్తుతం సొంత ఇంటి కల నెరవేరుస్తామని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ గృహాలు నిర్మిస్తామని ప్రభుత్వం ఇందిరమ్మ గృహ నిర్మాణానికి గుండు సున్నా చూపిస్తుందని వీర కర్ణ రెడ్డి ఆరోపించారు.

# కార్మిక చట్టాలను కాల రాస్తే ఊరుకోం..

**వేద న్యూస్,దామరచర్ల :**




దామరచర్ల మండల కేంద్రంలో ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు మండల కన్వీనర్ బైరం దయానందు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఎస్ పాపా నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లు వెంటనే రద్దు చేయాలని అదే విధంగా వంద సంవత్సరాలు పోరాడి సాధించుకున్న నలభై కార్మిక చట్టాలను,నాలుగు కోడ్ లుగా విభజించి కార్మికుల జీవితాలతోటి ఆటలాడుతుందని, ఇటువంటి మోసకారి ప్రభుత్వాన్ని వెంటనే గద్దధించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే గిరిజన సంఘం జిల్లా నాయకులు మాలోత్ వినోద్ నాయక్ మాట్లాడుతూ కార్మికులు పోరాటాలతో సాధించుకున్న ఎనిమిది గంటలుగా ఉన్న పని దినాన్ని పన్నెండు గంటలుగా చేయడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆయన అన్నారు. సిపిఐ ప్రజా సంఘం మహిళ నాయకురాలు శాంతమ్మ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్ ను తీసుకువచ్చి మరోసారి కార్మికుల హక్కులను కాల రాయాలని చూస్తుందని ఆమె పేర్కొన్నారు. టిఆర్ఎస్ ప్రజాసంఘాల నాయకుడు రఫీ మాట్లాడుతూ ఈనెల 20వ తారీకు జరిగే సార్వత్రిక సమ్మెకు టీఆర్ఎస్ ప్రజా సంఘాల సంపూర్ణ మద్దతు ఉంటుందని అని ఆయన అన్నారు. సిఐటియు మండల సహాయ కార్యదర్శి బైరం దయానంద మాట్లాడుతూ ఆనాడు ప్రజా సంఘం రైతు నాయకులు గత ఢిల్లీలో చేసినటువంటి రైతు సంఘం వారి పోరాటాలు ఫలితము అని,ఈరోజు ఆ నాలుగు లేబర్ కోడ్ లు తాత్కాలికంగా ఆపడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర మద్దతు ధర వచ్చేంత వరకు రైతులు ఏకం కావాలని అన్నారు. ఈ లేబర్ కోడ్ వలన సమ్మె చేసే హక్కు, యజమానులను నిలదీసి మాట్లాడే హక్కు లేకుండా హరించి వేస్తుందని ఇటువంటి కోడ్ లను వెంటనే బహిష్కరించి,ఈ నెల 20వ తారీఖున ప్రజలందరూ సార్వత్రిక సమ్మెలో పాల్గొని రోడ్ల మీదకు వచ్చి నిరసనలు చేయాలని పిలుపునిచ్చారు.

సిపిఐ ప్రజాసంఘాల నాయకులు పోలేపల్లి ఉదయ్ మాట్లాడుతూ 20వ తారీకున జరిగే సర్వత్రిక సమ్మెను అన్ని పార్టీలకు అతీతంగా ప్రజాసంఘాలు,రైతు కూలీలు,ఉద్యోగస్తులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులు,అనేక రకాల పారిశ్రామిక కేంద్రాల్లో పని చేస్తున్నటువంటి కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బైక్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ భాష,భవన నిర్మాణ రంగం నుండి బాలునాయక్,రైతు కూలీ సంఘం నుండి కోటయ్య పాల్గొనడం జరిగింది.

# నూతన అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలి

**వేద న్యూస్, హైదరాబాద్ :**

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న నూతన అధ్యాపకులు యొక్క సమస్యలను పరిష్కరించాలని బుధవారం తెలంగాణ ఇంటర్ విద్య డైరెక్టర్, తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఐఏఎస్ కి వినతిపత్రం ఇచ్చినట్లు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ -475 రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వసుకుల శ్రీనివాస్, డాక్టర్ కుప్పిశెట్టి సురేష్ తెలిపారు. బుధవారం హైదరాబాదులోని నాంపల్లి తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఇంటర్విద్య డైరెక్టర్ తో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ -475 ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 2023 మే నెలలో క్రమబద్ధీకరించబడ్డ నూతన అధ్యాపకులకు రెగ్యులేషన్ ప్రాసెస్ పూర్తి చేయాలని, వార్షిక ఇంక్రిమెంట్ విషయంలో కొంతమంది కావాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఇంటర్ విద్యా డైరెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. అందుకు వారు సానుకూలంగా స్పందిస్తూ నూతన అధ్యాపకుల సర్వీస్ విషయాలకు సంబంధించి ఎవరికి ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని, ఎవరైనా కావాలని ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు పెడితే ఇంటర్ విద్య ఆఫీసర్స్ దృష్టి తీసుకురావలసిందిగా తెలియజేస్తూ ఈ నెల 22 నుంచి నిర్వహించే ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఎగ్జామ్స్ సమర్ధవంతంగా నిర్వహించాలని, 2025 -26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ఎక్కువగా ఉండేటట్లు చూడాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు న్యాయమైన విద్య అందించినట్లు చూడాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 తరఫున పలు సూచనలు అందజేయడం జరిగింది. వాటికి ఇంటర్ విద్యా డైరెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాల చదివి విద్యార్థులకు రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండేటట్లు, జిల్లా ఇంటర్ విద్యాఆఫీసర్లు, సంబంధిత జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళామని, ప్రభుత్వ జూనియర్ కళాశాల చదివి విద్యార్థులకు రవాణా సౌకర్యాలు ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులో ఉండేటట్లు చూస్తామని తెలిపారు. అదే విధంగా వారికి హాస్టల్లో వసతి కల్పించే విషయంలో, జిల్లా కలెక్టర్ సహకారం కూడా తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థుల అటెండెన్స్ పెరగటానికి సరైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేసే సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ -475 రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, డాక్టర్ వి శ్రీనివాస్ డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయిని శ్రీనివాస్, గోవర్ధన్, పూర్ణచందర్, సాయిలు, కేపీ శోభన్ బాబు, రాష్ట్ర మహిళా కార్యదర్శి సంగీత, షాహినా బేగం, విశాలాక్ష్మి, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్, హరగోపాల్, పాతూరి రాజిరెడ్డి, గోక గణేష్, భాస్కర్, గుమ్మడి మల్లయ్య, ఏ తిరుపతిరావు, దాసు నాగరాజు, బండి నరసింహా, రాజు, ప్రేమ సాగర్, నవీన రెడ్డి, ప్రశాంత్ రజినీకాంత్ జి.వెంకటేశ్వర్లు బండి ప్రసాదు, కలీముల్లా, గుండె రావు, రాములు గణేష్ మేదర వెంకట ముత్యం తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రకు నిదర్శనం 'ఓరుగల్లు'

మొదటి పేజీ తరువాయి



చేనేత కాలంకారి దర్రీస్, జిఐ ట్యాగ్ పొందిన చపాట మిర్చి, పసుపుల ప్రత్యేకతల గురించి అధికారులు వివరించారు. కాకతీయ సామ్రాజ్య కళా వైభవానికి, శిల్పకళ నైపుణ్యానికి, నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన ఖిలా వరంగల్ కోటను కాకతీయులు తమ పరిపాలనలో ఈ కోటను అద్భుత నిర్మాణాలతో తీర్చిదిద్దిన తీరును, కోటలోని మూడు వృత్తాకార పొరలు భారీ రాతి ద్వారాలు (కీర్తి తోరణాలను) పరిశీలించి సుందరీమణులు ఫోటోలు దిగారు. తదనంతరం కాకతీయులు తమ పరిపాలనలో ఈ కోటలో అద్భుత నిర్మాణాలు, చరిత్ర, స్వయంభూ శివాలయం వంటి కాకతీయుల నిర్మాణాలు, ప్రాముఖ్యత లను సౌండ్ అండ్ లైట్ ద్వారా ప్రదర్శిస్తూ వివరించిన తీరును సుందరీమణులు తిలకించారు. అనంతరం యుద్ధ సమయంలో కాకతీయులు నిర్వహించే కళాకారులు ప్రదర్శించిన పేరిణి శివతాండవం నృత్య రూపకం, రాణి రుద్రమ నృత్య రూపకాలు ప్రపంచ సుందరీమణులను మంత్రముగ్ధుల్ని చేశాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ ఓరుగల్లు అంటేనే తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు..చరిత్రకు నిలువెత్తు నిదర్శనమైన ఓరుగల్లు చారిత్రాత్మక నగరానికి వివిధ దేశాల సుందరిమణులకు స్వాగతం, సుస్వాగతం అన్నారు.

మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం తెలంగాణకు గర్వకారణమని. వరంగల్ భవ్య దివ్య నవ్య నగరంగా పేరు గాంచిందన్నారు. అంతేకాకుండా కాకతీయ సామ్రాజ్య రాజధాని నగరం.. రమణీయ శిల్ప సౌందర్యం.. అద్భుతమై ఆలయాలు..అలరించే రాజస కట్టడాలు వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఆలయమని,ఒకటి కాదు రెండూ కాదూ..వేయి స్తంభాలతో కొలువైన కోవెల నగరమన్నారు.

త్రినగరిలో.. కొలువైన త్రికూటాలయం..వరంగల్ నగరానికి వన్నె తెచ్చిన కట్టడాలు అనేకమని తెలిపారు. కాకతీయ రాజుల కట్టడాలు.. నేటికీ ఆనాటి చరిత్రకు నిలువెత్తు నిలబడి ఉన్న సాక్ష్యాలన్నారు. వరంగల్ కోట కాకతీయ సామ్రాజ్య కాలంలో ఒక ఐతిహాసిక దుర్గం.. కాకతీయులు అద్భుత నిర్మాణమని అన్నారు. వరంగల్ కోటలోని కీర్తి తోరణాన్ని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర చిహ్నంగా ఎంచుకుందని తెలిపారు. తద్వారా తెలంగాణ సాంస్కృతిక గుర్తింపును ప్రపంచవ్యాప్తంగా చాటుతోంది. ఇక్కడి సంస్కృతి సాంప్రదాయాలు వారసత్వ సంపద, చారిత్రక ప్రదేశాలు గొప్ప అనుభూతిని కలిగిస్తాయని తెలిపారు. రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో వరంగల్ నగరాన్ని రెండవ రాజధానిగా అభివృద్ధి చేస్తున్నట్లు, త్వరలో మామూనూరు ఎయిర్పోర్ట్ రాసున్నదన్నారు.

మిస్ వరల్డ్ గ్లోబల్ ఈవెంట్. రాష్ట్ర సాంప్రదాయం పర్యాటక ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటేందుకు ఇది



ఒక చక్కటి అవకాశమని, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 72వ మిస్‌వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్నదన్నారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణతో ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ పర్యాటక ప్రదేశాలకు విశేష ప్రచారం దక్కనుంది. తెలంగాణ సాంస్కృతిక వైభవం, చారిత్రక గాథలు, ఆధునిక అభివృద్ధి, పర్యాటక ప్రాముఖ్యత ను ప్రపంచానికి తెలుపడంతో రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో ఒక "మల్టీడైమెన్షనల్ టూరిజం హబ్"గా నిలిపే అవకాశం లభిస్తుందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మిస్ అర్జెంటీనా, మిస్ కెనడా, మిస్ పనామా, యునైటెడ్ స్టేట్స్, పరాగ్వే తదితరులు తెలంగాణ సాంప్రదాయం, సంస్కృతి అద్భుతమైనదని కొనియాడారు. ప్రపంచ సుందరీమణుల పోటీల్లో భాగంగా ఓరుగల్లు సందర్శించిన సుందరిమణులకు వరంగల్ కోటలో రాష్ట్ర మంత్రి కొండ సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు హుస్సేన్ నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎం ఎల్ ఏ. కె ఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ డాక్టర్ ఆహావిని తానాజీ వాఖేడే, చేతుల మీదుగా వరంగల్ ప్రఖ్యాతిగాంచిన చేనేత కలంకారి డర్టీస్, చపాట మిర్చి, పాకాల, కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ద్వారా రూపొందించిన సావనీర్ లో కూడిన బహుమతులను సుందరీమణులకు అందించారు.

# 'బంధన్'తో బంధమేంటీ..?

మొదటి పేజీ తరువాయి

బయటపడిన ఓ బాధితుడు జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా కనీసంగా పట్టించుకున్న దాఖలాలు లేవు. పక్క జిల్లా అయిన సూ ర్యాపేటలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్, ఐఎంఏ సభ్యులు పలు ప్రైవేటు ఆస్ప త్రుల్లో దాడులు చేసి అనుమతి లేని ఆస్పత్రులను గుర్తించి చర్యలు తీసుకు న్నారు. అర్హత లేని వైద్యులను తనిఖీల్లో గుర్తించి తగు చర్యలు తీసుకున్నారు. కాగా, మహానగరమైన వరంగల్‌లో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

### ఆమ్యామ్యాలతో అధికారులు గప్ చుప్..?

'బంధన్' ఆస్పత్రిలో పోస్ట్ ఆఫ్ కేర్‌లో జరిగిన నిర్లక్ష్యంతో నెలలపాటు మంచానికి పరిమితమై, అనారోగ్యంతో ఇప్పటికీ సతమతమవుతున్న బాధితుడు.. తనకు జరిగిన అన్యాయంపై జిల్లా స్థాయితో పాటు ఉన్నతాధికారులకు, రాష్ట్రస్థాయిలో పలు ఫోరంలలో ఫిర్యాదు చేశారు. ఐఎంఏకు సైతం కంప్లయింట్ చేశారు. ఆస్పత్రిలో నిర్లక్ష్యం జరిగినట్టు వైద్యులు ఒప్పకున్నా కనీసంగా చర్యలకు అధికారులు జంకుతుండటం పట్ల సర్వత్రా విమ ర్శలు వ్యక్తమవుతున్నాయి. 'బంధన్'తో సంబంధిత వైద్యారోగ్య శాఖ అధికారులతో పాటు ఉన్నతాధికారులతో బంధాలు బలంగా పెనవేసుకోబడి ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి నెలా సంబంధిత డిపార్ట్‌మెంట్‌కు విధిగా ఆమ్యామ్యాల అప్పగించడం వల్లే అధికారులు ఆ మామూళ్ల మత్తులో చూసీచూడనట్టుగా.. తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలూ బలంగా వినిపిస్తున్నాయి. 'బంధన్' బరితెగింపునకు రోగుల ప్రాణాలు ఎన్ని పోయినా తమకేమీ పట్టింపు లేదని, తమకు అందాల్సినవి తమకు పక్కాగా అందుతాయని అధికారులు భావిస్తున్నట్టు తెలుస్తోంది. హనుమకొండ బంధన్ ఆస్పత్రిలో అర్హత, అనుమతి లేకుండా చేస్తున్న వైద్యం గుట్టు రట్టు అయినా ఎందుకు చర్యలకు జంకుతున్నారని నగరవాసులు అడుగుతున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు వైద్యారోగ్య శాఖ, మంత్రి ఉన్నతాధికారులు ఆస్పత్రిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రేసోనేన్స్ పబ్లిక్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి..!

మొదటి పేజీ తరువాయి

కేంద్రంలో ఈ విద్యా సంవత్సరం అనేక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ ఓపెనింగ్ పర్మిషన్ రాకుండా, రికగ్నైజేషన్ లేకుండా విద్యా శాఖ అధికారులను డబ్బులతో మేనేజ్ చేస్తూ కనీస మౌలిక సదుపాయాలు లేకుండా ఇష్టారాజ్యంగా వివరిస్తున్నారన్నారు. రేసోనేన్స్ పాఠశాలతో పాటు అనుమతి లేకుండా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోకుంటే జిల్లా విద్యాధికారి కార్యాలయాన్ని 5000 మంది విద్యార్థులతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్ , జిల్లా సహాయ కార్యదర్శి కసర బోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు శ్రీపతి వినయ్, వచ్చు జ్యోతి పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073